ఇంటర్ కాలేజీల గుర్తింపునకు నోటిఫికేషన్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 2024-25 విద్యాసంవత్సరంలో జూనియర్ కాలేజీల అనుబంధ గుర్తింపు కోసం ఇంటర్మీడియట్ బోర్డు శనివారం నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. రాష్ట్రంలోని కాలేజీలు షెడ్యూల్ గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని బోర్డు కార్యదర్శి శృతి ఓఝా ఒక ప్రకటనలో తెలిపారు. కాలేజీలు ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు పొందాకే నడపాల్సి ఉంటుంది. ప్రస్తుతం కొత్త కాలేజీల ఏర్పాటుకు అవకాశం లేకపోగా, ఇప్పటికే నడుస్తున్న కాలేజీలకు గుర్తింపును ఇవ్వడంతోపాటు, వీటిల్లో అదనపు సెక్షన్లకు ఏటా అనుబంధ గుర్తింపును పునరుద్ధరిస్తుంటారు. జూన్ కంటే ముందు అనుబంధ గుర్తింపు జారీ ప్రక్రియ ముగియాల్సి ఉండగా.. వివిధ కారణాలతో ఆలస్యమవుతున్నది. ఈ నేపథ్యంలో మందుగానే అనుమతులు మంజూరు చేస్తే

గందరగోళానికి తావుండదన్న ఆలోచనతో ఇంటర్ బోర్డు అనుమతుల జారీ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఆలస్య రుసుము లేకుండా కాలేజీ యాజమాన్యాలు మార్చి 31 వరకు దరఖాస్తులు సమర్పించాల్సి ఉన్నది. ఆలస్య రుసుముతో మే 5 వరకు అవకాశం కల్పించారు. కళాశాల భవన రిజిస్ట్రేషన్ డీడ్ లేదా లీజు డీడ్, అప్రూవ్డ్ బిల్డింగ్ ప్లాన్, ఫైర్ సేఫ్టీ ఎన్‌వోసీ, కార్పస్ ఫండ్, స్ట్రక్చరల్ సౌండ్‌నెస్ సర్టిఫికెట్, శానిటరీ సర్టిఫికెట్, బోధనా సిబ్బంది డాక్యుమెంట్లు, ఆటస్థలం డాక్యుమెంట్లను దరఖాస్తుతోపాటు సమర్పించాల్సి ఉంటుంది.

దరఖాస్తుల షెడ్యూల్ ఇలా

ఆలస్య రుసుము లేకుండా	31-3-24
ఆలస్య రుసుముతో..	
1,000	07-4-24
5 వేలు	14-4-24
10 వేలు	21-4-24
15 వేలు	28-4-24
20 వేలు	05-5-24

ఇంటర్ హాల్‌టికెట్లు విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ఈ నెల 28 నుంచి మార్చి 19 వరకు జరగనున్న ఇంటర్ వార్షిక పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల హాల్‌టికెట్లను అధికారులు వెబ్‌సైట్‌లో విడుదల చేశారు. విద్యార్థులు www.tsbie.cgg.gov. inలో తమ హాల్‌టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని ఇంటర్ బోర్డు కార్యదర్శి శృతి ఓఝా ఒక ప్రకటనలో తెలిపారు. పొరపాట్లు ఉంటే వెంటనే డీఐఈవోలను సంప్రదించి సరిదిద్దుకోవాలని పేర్కొన్నారు. హాల్‌టికెట్లపై ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా విద్యార్థులను పరీక్షకు అనుమతించాలని చీఫ్ సూపరింటెండెంట్లను ఆదేశించారు.

ఈసెట్ కన్వీనర్‌గా ప్రొఫెసర్ చంద్రశేఖర్

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఈసెట్ కన్వీనర్‌గా ఓయూ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పీ చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఓయూలో ఎలక్ట్రానిక్స్ విభాగం ప్రొఫెసర్‌గా ఆయన పనిచేస్తున్నారు. ఇదివరకు ఈసెట్ కన్వీనర్‌గా వ్యవహరించిన ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ ఉన్నత విద్యామండలి కార్యదర్శిగా నియమితులయ్యారు. దీంతో ఓయూ వీసీ ప్రతిపాదనల మేరకు ఉన్నత విద్యామండలి అధికారులు చంద్రశేఖర్‌ను నూతన కన్వీనర్‌గా నియమించారు.

జీవో-317పై మంత్రివర్గ ఉపసంఘం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో కొత్త జోనల్ విధానం అమలు, ఉద్యోగుల కేటాయింపునకు జారీచేసిన జీవో-317 బాధితుల సమస్యల పరిష్కరించేందుకు ప్రభుత్వం క్యాబినెట్ సబ్ కమిటీని నియమించింది. రాష్ట్ర మంత్రి దామోదర రాజనర్సింహ నేతృత్వంలో మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌ను ఈ కమిటీలో సభ్యులుగా నియమిస్తూ సీఎస్ శాంతికుమారి శనివారం ఉత్తర్వులు జారీచేశారు. జీవో-317, జీవో-46తో తలెత్తిన సమస్యలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలని కమిటీకి సూచించారు.

సబ్ కమిటీపై హర్షం

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): జీవో-317తో తలెత్తిన సమస్యల పరిష్కారానికి మంత్రివర్గ ఉపసంఘాన్ని ఏర్పాటు చేయడంపై వివిధ సంఘాలు వేర్వేరు ప్రకటనల్లో హర్షం వ్యక్తంచేశాయి. సమస్యలను సహేతుకంగా పరిష్కరించాలని పీఆర్టీయూ (టీఎస్) ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి, పీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పింగిలి శ్రీపాల్‌రెడ్డి, బీరెల్లి కమలాకర్‌రావు, గురుకుల జేఏసీ అధ్యక్షుడు మామిడి నారాయణ, కార్యదర్శి మధుసూదన్, స్టాఫ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభుదాస్, తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ టీచర్స్, ఎంప్లాయీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు బాలరాజు కోరారు.

మా సమస్యలు పరిష్కరించండి

- **పీఆర్, ఆర్‌డీ కమిషనర్‌కు పంచాయతీ కార్యదర్శుల వినతి**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): పంచాయతీ కార్యదర్శులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ అసోసియేషన్ (టీపీఎస్ఏ) పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖను కోరింది. టీపీఎస్ఏ అధ్యక్షుడు పీ మధుసూదన్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఈ శ్రీనివాస్, కోశాధికారి పండరినాథ్ శనివారం హిమాయత్‌నగర్‌లోని పంచాయతీరాజ్ కమిషనర్ కార్యాలయంలో ఆ శాఖ కమిషనర్ అనితా రామచంద్రన్‌ను కలిశారు. మొత్తం 13 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఆమెకు ఇచ్చారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నాలుగేండ్ల సర్వీసులో రెండేండ్లు ప్రొబేషన్ కాలంగా, మిగతా రెండేండ్లను రెగ్యులర్ సర్వీస్‌గా పరిగణనలోకి తీసుకోవాలని విన్నవించారు.

ఐఈఆర్పీలను క్రమబద్ధీకరించాలి

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): సమగ్ర శిక్ష ప్రాజెక్ట్‌లో పనిచేస్తున్న ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ రిసోర్స్ పర్సన్ల (ఐఈఆర్పీ)ను క్రమబద్ధీకరించాలని ఐఈఆర్పీ అసోసియేషన్ సీఎం రేవంత్‌రెడ్డిని కోరింది. ఈ మేరకు శనివారం సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనను కలిసి అసోసియేషన్ ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. న్యాయ నిపుణులతో మాట్లాడి తగు న్యాయం చేస్తామని సీఎం హామీనిచ్చినట్టు అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు టీ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు బోయ శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి విజయాచారి, కోశాధికారి దామోదరాచారి, బాదిని మల్లేశ్‌గౌడ్, సునీత, జయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల ముందే నియామకాలు చేపట్టాలి

- **అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సెలెక్టెడ్ అభ్యర్థులు**
- **గాంధీభవన్ వద్ద ఆందోళన.. జాప్యంపై ఆగ్రహం**
- **'హలో నిరుద్యోగి, చలో గాంధీభవన్' పేరిట నిరసన**

సుల్తాన్‌బజార్, ఫిబ్రవరి 24: లోక్‌సభ ఎన్నికల కోడ్ రాకముందే తమ నియామకాలు చేపట్టాలని ఏఈఈ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. 'హలో నిరుద్యోగి, చలో గాంధీభవన్' పేరిట శనివారం నిర్వహించిన ఆందోళనలో రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అభ్యర్థులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. గాంధీభవన్ వద్ద ప్లకార్డులు ప్రదర్శిస్తూ నిరసన వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా అభ్యర్థులు పీసీసీ అధికార ప్రతినిధి భవానీరెడ్డికి వినతిపత్రాన్ని అందించారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉద్యోగ పరీక్ష ఫలితాలు వచ్చి ఆరు నెలలు గడుస్తున్నా టీఎస్‌పీఎస్సీ అధికారులు వెరిఫికేషన్ చేయకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని తెలిపారు. సుమారు 1,540 మంది ఎంపికై ఆరు

గాంధీభవన్ వద్ద నిరసనలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోస్టులకు ఎంపికైన అభ్యర్థులు

నెలలు గడుస్తున్నా పోస్టింగ్‌లు ఇవ్వడంలో జాప్యం ఎందుకు చేస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగతా అన్ని డిపార్ట్‌మెంట్లకు పోస్టింగ్‌లు ఇచ్చి తమకు మాత్రం ఎందుకు ఇవ్వట్లేదని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పేపర్ లీకేజీ, కోర్టు కేసుల పేరిట కాలయాపన జరిగిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి వెంటనే స్పందించి తమకు నియామకపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఎం దృష్టికి తీసుకెళ్తానన్న భవానీరెడ్డి హామీతో అభ్యర్థులు ఆందోళనను విరమించారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎందుకివ్వరు?

- **కౌంటర్ దాఖలు చేయాలని ఉన్నత విద్యాశాఖకు హైకోర్టు ఆదేశం**

హైదరాబాద్, ఫిబ్రవరి24 (నమస్తే తెలంగాణ): పదో తరగతి వరకు తెలంగాణలో చదివి రాష్ట్ర విభజన తర్వాత ఉద్యోగ గీత్యా ఏపీకి తల్లి వెళ్లడంతో అక్కడ ఇంటర్, డిగ్రీ చదివిన విద్యార్థినికి ఎంబీఏ ఫీజు రీయంబర్స్‌మెంట్ ఇవ్వకపోవడంపై కౌంటరు దాఖలు చేయాలని రాష్ట్రానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. విద్యార్థిని నుంచి పరీక్ష ఫీజు స్వీకరించి, పరీక్షలకు అనుమతించాలని మధ్యంతర ఆదేశాలు జారీ చేసింది. ఈ రాజ్యంపై విచారణ పూర్తయ్యే వరకు ఫలితాలను వెల్లడించరాదని పేర్కొన్నది. ఫీజు రీయింబర్స్‌మెంట్ ఇవ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ వరంగల్ వాగ్దేవి కాలేజీలో ఎంబీఏ చేస్తున్న బీ వాసంతి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ సూరేపల్లి నంద విచారణ జరిపారు. కౌంటర్లు దాఖలు చేయాలని ఉన్నత విద్యాశాఖ, సాంఘిక సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శులకు, సాంఘిక సంక్షేమ శాఖ కమిషనర్‌కు, వాగ్దేవి కాలేజీ యాజమాన్యానికి హైకోర్టు నోటీసులు జారీ చేసింది విచారణను మార్చి 3కు వాయిదా వేసింది.

విద్యార్థులకు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వాల్సిందే..

- **ఇవ్వకుంటే బ్లాక్ లిస్టులో పెడతాం**
- **ఉన్నత విద్యామండలి హెచ్చరిక**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ట్యూషన్ సహా ఇతర ఫీజులు చెల్లించకలేదన్న సాకుతో విద్యార్థుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఇవ్వకుండా ఇబ్బందిపెట్టే కాలేజీలపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలంగాణ ఉన్నత విద్యామండలి హెచ్చరించింది. ఇలాంటి కాలేజీలను బ్లాక్ లిస్టులో పెడతామని స్పష్టం చేసింది. ఈ మేరకు ఉన్నత విద్యామండలి కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్ రాష్ట్రంలోని అన్ని వర్సిటీల రిజిస్ట్రార్లకు లేఖలు రాశారు. ఈ ఆదేశాల మేరకు వర్సిటీలు తమ పరిధిలోని కాలేజీలకు లేఖలు పంపాలని పేర్కొన్నారు.

పాలిటెక్నిక్ లెక్చరర్ పరీక్ష ఫైనల్ కీ విడుదల

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): పాలిటెక్నిక్ లెక్చరర్ ఉద్యోగ భర్తీ పరీక్ష ఫైనల్ కీని టీఎస్‌పీఎస్సీ శనివారం విడుదల చేసింది. రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖలో పాలిటెక్నిక్ లెక్చరర్ల భర్తీ కోసం నిరుడు సెప్టెంబర్ 4 నుంచి 8 వరకు నిర్వహించిన కంప్యూటర్ బేస్డ్ రిక్రూట్‌మెంట్ టెస్ట్ (సీబీఆర్‌టీ) నిర్వహించారు. ఫైనల్ కీతోపాటు రెస్పాన్స్ షీట్లను కూడా వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేసినట్టు టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో మొత్తం 19 సబ్జెక్టులలో లెక్చరర్ల భర్తీ కోసం విడుదల చేసిన ఈ నోటిఫికేషన్‌లో మొత్తం 247 పోస్టులను ప్రకటించారు. ఇందులో మల్టి జోన్-1కు 93, మల్టి జోన్-2లో 154 పోస్టులను కేటాయించారు.

శనివారం సచివాలయంలో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేటికి పుష్పగుచ్ఛం ఇస్తున్న తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం బాధ్యులు

మెరుగైన పీఆర్సీని ప్రకటించాలి

- **ఎన్నికలకు ముందే డీఏ ఇవ్వాలి**
- **రేవంత్‌రెడ్డిని కోరిన టీజీవో నేతలు**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులకు ప్రయోజనం చేకూర్చేలా మెరుగైన పీఆర్సీని ప్రకటించాలని తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీజీవో) రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరింది. పార్లమెంట్ ఎన్నికలకు ముందే పెండింగ్‌లో ఉన్న మూడు డీఏల్లో ఒక డీఏను విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. నూతనంగా ఎన్నికైన టీజీవో కార్యవర్గ రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు ఏలూరి శ్రీనివాస్‌రావు, ఏనుగుల సత్యనారాయణ నేతృత్వంలో ప్రతినిధి బృందం శనివారం డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డిని కలిసింది. ఈ సందర్భంగా పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని, డీఏ ఏరియర్స్‌ను చెల్లించాలని కోరగా సీఎం సానుకూలంగా స్పందించినట్టు నేతలు తెలిపారు. సీపీఎస్ రద్దు, సాధారణ బదిలీలు, ఉద్యోగులు, పెన్షనర్లకు ఈహెచ్ఎస్ సమస్యలను త్వరగా పరిష్కరించాలని సీఎంను కోరామని టీజీవో సంఘం బాధ్యులు తెలిపారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించండి

- **ధరణి పోర్టల్ ఏజెన్సీపై విచారణ: సీఎం**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ధరణి పెండింగ్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. మార్చి మొదటి వారంలో అన్ని తహసీల్దార్ కార్యాలయాల్లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. శనివారం సచివాలయంలో ధరణి కమిటీతో సీఎం సమీక్ష నిర్వహించారు. కమిటీ ఇచ్చే తుది నివేదిక ఆధారంగా శాశ్వత పరిష్కారానికి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. లోపాలను సవరించేందుకు చట్ట సవరణ చేయటం, కొత్త ఆర్‌వోఆర్ చట్టం చేయటం తప్ప గత్యంతరం లేదని కమిటీ సభ్యులు సీఎంకు నివేదించారు. 2020లో అమల్లోకి వచ్చిన ఆర్‌వోఆర్ చట్టంలో అనేక లోపాలున్నాయని ధరణి కమిటీ సీఎంకు నివేదించింది.

ఏజెన్సీపై విచారణ

ధరణి పోర్టల్ నిర్వహిస్తున్న ఏజెన్సీపై సమగ్ర విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశించారు. సీసీఎల్ఏ అధ్వర్యంలో నిర్వహించాల్సిన ఈ పోర్టల్‌ను ప్రైవేటు ఏజెన్సీకి ఎందుకు అప్పగించారని ప్రశ్నించారు. భూముల రికార్డుల డాటాకు భద్రత ఉన్నదా? సురక్షితంగా ఉన్నట్టా? లేనట్టా? అని అనుమానం వ్యక్తంచేశారు. సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ధరణి కమిటీ సభ్యులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే లాస్య మృతిపై కొనసాగుతున్న దర్యాప్తు

- **కుటుంబ సభ్యులు, డ్రైవర్ ఆకాశ్ వాంగ్మూలం రికార్డు చేసిన పోలీసులు**

సంగారెడ్డి, ఫిబ్రవరి 24(నమస్తే తెలంగాణ): కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతి కేసు దర్యాప్తులో భాగంగా.. శనివారం పటాన్‌చెరు డీఎస్పీ రవీందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సికింద్రాబాద్‌లోని ఆమె నివాసానికి వెళ్లి.. తల్లి, అక్కతోపాటు ఆమె కూతురు నుంచి స్టేట్‌మెంట్లు తీసుకున్నారు. లాస్య తల్లి స్టేట్‌మెంట్ ప్రకారం.. 'నేను, నా కూతురు లాస్యనందిత, మనవరాలుతో కలిసి గురువారం రాత్రి కారులో సదాశివపేట మండలం ఆరూర్ సమీపంలోని మిస్కిన్‌షాబాబా దర్గాకు వెళ్లాం. దర్గాలో ప్రార్థనల అనంతరం ఆరూర్ నుంచి బయలుదేరి శుక్రవారం వేకువజామున 3.30 నుంచి 4 గంటల ప్రాంతంలో సికింద్రాబాద్‌లోని ఇంటికి చేరుకున్నాం. ఇంటికి చేరుకున్నాక లాస్య నందిత అల్పాహారం కోసం కారులో డ్రైవర్ ఆకాశ్‌తో కలిసి సంగారెడ్డి వైపు వెళ్లింది. ఈ క్రమంలో ఓఆర్ఆర్‌పై ప్రమాదం జరిగి లాస్య దుర్మరణం చెందింది' అని తెలిపారు. మియాపూర్‌లోని దవాఖానలో చికిత్స పొందుతున్న డ్రైవర్ కమ్ పీఏ ఆకాశ్ కూడా లాస్య నందిత కుటుంబసభ్యులు చెప్పినట్టుగానే స్టేట్‌మెంట్ ఇచ్చాడని సమాచారం.

వీఐపీల డ్రైవర్లకు ఫిట్‌నెస్ పరీక్షలు

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రముఖుల వద్ద డ్రైవర్లుగా విధులు నిర్వర్తిస్తున్న వారికి ఇకపై డ్రైవింగ్ పరీక్షలు నిర్వహిస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ చెప్పారు. అర్హత లేని డ్రైవర్లతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, అందుకే అనుభవం ఉన్నవారినే డ్రైవర్లుగా నియమించుకోవాలని సూచించారు.

నకిలీ బ్రాండ్ల ముఠా అరెస్ట్

హైదరాబాద్ సిటీబ్యూరో, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): ప్రజల ప్రాణాలకు హాని కలిగించే నకిలీ ఆహార పదార్థాలు తయారు చేసే ముఠా గుట్టు రట్టయ్యింది. కాటేదాన్, నాగారం కేంద్రంగా ఈ ముఠా నకిలీ వస్తువులను ప్రముఖ బ్రాండ్ల పేరిట విక్రయిస్తున్నది. దాడి చేసిన టాస్క్‌ఫోర్స్ ముగ్గురిని అదుపులోకి తీసుకున్నది. రాజస్థాన్‌కు చెందిన ముఠాగా గుర్తించారు. నిందితుల నుంచి సుమారు రూ.2కోట్ల విలువ చేసే సొత్తును స్వాధీనం చేసుకుని సీజ్ చేశారు. డీసీసీ కార్యాలయంలో విలేకరులకు ఈస్ట్‌జోన్ డీసీపీ రష్మీ పెరుమాళ్ కేసు పూర్వాపరాలను వెల్లడించారు. దాడుల్లో సెంట్రల్ జోన్ టాస్క్‌ఫోర్స్ డీసీపీ రాజు నాయక్, కాచిగూడ ఇన్‌స్పెక్టర్ ఎన్.రామలక్ష్మణ్ రాజు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉండాలి

- **రాష్ట్ర వినియోగదారుల కమిషన్ అధ్యక్షుల నిర్ణయంపై హైకోర్టు స్పందన**

హైదరాబాద్, ఫిబ్రవరి 24 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లోని మూడు జిల్లా వినియోగదారుల కమిషన్ల ప్రాదేశిక అధికార పరిధిని నిర్ణయిస్తూ 2022 నాటి సర్క్యులర్‌ను పక్కనపెట్టిన రాష్ట్ర వినియోగదారుల కమిషన్ ఇన్‌చార్జి అధ్యక్షురాలు ఇచ్చిన ఉత్తర్వులను హైకోర్టు రద్దు చేసింది. రాష్ట్ర కమిషన్ అధ్యక్షుల హోదాలో హైదరాబాద్‌లోని జిల్లా కమిషన్ల అధికార పరిధిని నిర్ణయించవచ్చని, అయితే ఆ నిర్ణయం పారదర్శకంగా ఉండాల్సిందేనని స్పష్టం చేసింది. పరిధి మార్పు ఎందుకు చేస్తున్నారో స్పష్టమైన వివరణ ఉండాలని పేర్కొన్నది.

This may be published in Newspapers and TV from the day following the last date for withdrawal of candidature and upto two days before the date of poll

Format-C2

(For political party to publish in website, newspapers, TV)

Declaration about criminal antecedents of candidates set up by the party

(As per the Judgement dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP(Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors.Vs.Union of India & Anr.)

Name of political party : **BHARAT RASHTRA SAMITHI**

*Name of Election : **BIENNIAL ELECTION TO THE COUNCIL OF STATES-2024 (BY THE ELECTED MEMBERS OF TELANGANA LEGISLATIVE ASSEMBLY)**

Name of State/UT : **Telangana**

1	2	3	4		5		
Sl. No.	Name of Constituency	Name of candidate	(A)Pending Criminal Cases		(B)Details about cases of conviction for criminal offences		
			Name of Court, Case No. & status of the cases (s)	Sections of the Acts concerned & brief description of offence (s)	Name of Court & date (s) of orders(s)	Description of offence (s) & Punishment imposed	Maximum Punishment Imposed
1	BY THE ELECTED MEMBERS OF TELANGANA LEGISLATIVE ASSEMBLY	RAVI CHANDRA VADDIRAJU	FIR No: 523/2018, dated:17.12.2018Subedari Police Station, Warangal Commissionerate VI Addl.Junior Civil Judge Warangal CC No:158 of 2019	U/Sec.188,171-E, IPC, 127 (A) RPA An Allegation of Election Code Violation	-NA-	-NA-	-NA-
			FIR No: 307/2018, dated:16.03.2019 Metwada Police Station, Warangal Commissionerate VI Addl. Junior Civil Judge Warangal CC No: 5954/22	U/Sec. 171-E, 188,IPC 123(1)RPA An Allegation of Election Code Violation			
			FIR No: 516/2018, dated:23.06.2023, Jangoan Police Station, Jangaon I-Prl.Junior Civil Judge, Jangaon CCNo:762/2023	U/Sec.171(B)(E), 468, 471, 420, 120(b)IPC An Allegation of Election Code Violation			
			FIR No: 411/2018, dated:24.01.2019 Intezargunj Police Station Warangal Commissionerate I-Addl.Jr.Civil Judge-cum-I-Addl Judicial Magistrate of first Class, Warangal CC No: 134/19	U/Sec.143,149, 188,290,341 IPC An allegation of Election code Violation			
			FIR No: 473/2018, dated:27.12.2018, Mills Colony, Police Station Warangal Commissionerate I-Addl.Jr.Civil Judge-cum-I-Addl Judicial Magistrate of first Class, Warangal CC No: 3289/2018	Sec.188 IPC An allegation of Election code Violation			
			FIR No: 137/2021, dated:02.05.2022 Madikonda Police station, Warangal Commissionerate III-Addl. Jr. Civil Judge, Warangal CC No: 1216/2022	Sec.304A,IPC 180,181(MV ACT) An allegation of Allowing Unauthorized person to drive vehicle			

*In the case of election to Council of States or election to Legislative Council by MLAs, mention the election Concerned in place of name of constituency.

Sd/- Signature of the Officer bearer of the Political Party

Name and Designation: SOMA BHARATH KUMAR

General Secretary

BHARAT RASHTRA SAMITHI